# మలుపు

"గడ్డం జేస్తానయ్యా !" గడప అవతల నిటారుగా నుంచున్న నర్సయ్య గొంతు... దీనంగా అడిగాడు.

పాతమంచానికి కొత్త నవారు గట్టిగా బిగిస్తున్న ఇంటి యజమాని చూపులు చిట్లిపోయినై. గడపవైపు చూశాడతడు.

కావిరంగుకొచ్చిన ఖద్దరు ధోవతి, పొడవు గీతల ఫుల్ షర్టులో బక్కపలచని మనిషి... పాతికేళ్ళుండొచ్చు. చెదిరిన తలవెంట్రుకలు, పెదాలమీద అతికించుకున్న చిరునవ్వు, చెప్పుల్లేని కాళ్లు... కత్తెర మీసాలు... నర్సయ్య కొత్తరకం మనిషిలా కన్పించాడు యజమానికి. నవారు వదిలేసి నరాలు బిగపట్టుకొని నవ్వేశాడు.

"అంటె...!" నోరు సగం తెరుచుకుంది.

"అ...అదేనయ్యా ! షేవింగ్ జేస్తా... చంకన వేళ్లాడుతున్న కల్ప (మంగలి పనిముట్ల పెట్టె)ను చూపించాడు". క్రాఫింగ్ గూడ మంచిగ జేస్తానయ్యా, పిల్లలకు, పెద్దలకు, ఎట్లా కావాలంటే అట్ల క్షవరం చేస్తానయ్యా !" తెచ్చిపెట్టుకున్న ఉత్సాహం కళ్లల్లో కదలాడింది.

"ఓర్నీయవ్వ !" కంయ్‌మని నవ్వాడు యజమాని. ఆ నవ్వుకు ఒళ్లంతా కదిలిపోతుంది' '. గప్పుడెప్పుడో ఊరికో బస్సు - ఇంటికో కరంటు దీపము స్కీమొచ్చింది. గీ నడుమ పెజల వద్దకు పాలన వచ్చిపోయింది. మరిప్పుడు జన్మభూమి స్కీముల 'ముంగిట్ల మంగలి' అనేది కొత్తగా పెట్టింద్రా?' ' మళ్లీ నవ్వాడు.

నవ్వు కాదది... గోలీ సోడా సీసాను గచ్చునేలకేసి కొట్టిన శబ్దం.

జడుసుకున్నంత పనైంది నర్సయ్యకు.

"కాదయ్యా ! బతుకుదెరువు కోసం బజారుకెక్కిన".

"అయితే వో అడ్డా జూస్కొని గడ్డాలెజెయ్. హేర్ కటింగ్ సెలూన్ పెట్టుకుంటే బోలెడంత సంపాదిస్తావ్ గదా !"

"సెలూన్ పెట్టుకునే తాహతుంటే గిట్లా నాలుగిండ్లు దిరిగే ఖర్మ నాకెందుకు ?" అనాలన్పించింది... కాని ఆయన మళ్ళీ నవ్వుతాడేమోనని భయమేసింది.

"అది... నాతోని గాదయ్యా. నేనీ వూరికి కొత్త. పైసలు గూడా లేవు. దయచేసి..."

"అవునవును... నిన్నెప్పుడు చూల్లేదు. అయినా... ఈ రోజులల్ల గడ్డాలు దీయించుకునేతందుకు అడ్డాదాకా ఎవలొస్తున్నరూ ? ఇంటికో షేవింగ్ డబ్బా, మనిషికో బ్లేడు ప్యాకెట్టు. నేను గూడా బ్లేడుతోనే గడ్డం జేసుకుంటా. నెత్తిబాగా పెరిగినంక క్రాఫింగ్ కొస్తాలే" చిన్నగా నవ్వి పెద్దగా చేతులు చాచి నవారందుకున్నాడు. మారు మాటాడకుండా తన పనిలో లీనమయ్యాడు.

నర్సయ్య నవనాడుల్లో నీరసం ఆవులించింది. "అయ్యా దేవుడా గిట్ల జేస్తివేందయ్యా" అనుకుంటూ ఇంటిమెట్లు దిగాడు.

కరకర పొద్దు పొడిచేప్పుడు కల్ప చంకన వేసుకుని బయలుదేరాడు. పది, పదిహేను ఇళ్లు దిరిగాడు. మీసమున్న ప్రతి మనిషినీ అడిగాడు. అంతా ఎగాదిగా చూసేవారే గాని ఎంతో కొంత పంజెప్పేవాళ్లే కరువయ్యారు.

మీసం మొలిచిన ప్రతివాడూ సొంత షేవింగ్ ఏర్పాటు చేసుకున్న ఈ రోజుల్లో గిట్ల ఎంత దిరిగితే ఏం లాభం ? క్రాఫింగ్ పెరిగి నెత్తి ఎంటికలు కండ్లమీదికొస్తెనే మంగలి యాదికొస్తడు. అద్దాల సెలూన్‌ల, ఫ్యాన్‌కింద, పెద్దకుర్చీమీద కూకుండి పేపర్ చదువుకుంట చేయించుకుంటరు. కల్ప పట్టుకుని కడప, కడప దిరిగెటోణ్ని ఆటి కాపరోన్ని జూసినట్టు చూస్తరు... బుర్రలో బురిడీలు కొడ్తున్న ఆలోచనలతో అడుగులో అడుగేసుకుంటూ గుడికి చేరాడు నర్సయ్య.

"ఇయ్యాల టీ.విల చిరంజీవి సిన్మా వస్తదటా" బీడి ఆకు కత్తిరిస్తున్న భామామణి నాందీ ప్రస్తావన పలికింది.

తెలంగాణాలో బీడీల కార్ఖానా అంటె - తెగువున్న మహిళల స్ఫూర్తి కేంద్రము.

బీడీ కార్ఖానాలో వరుసదీరి కూచుండి బీడీలు జేసుకుంటున్న యువతుల్లో ఉత్సాహం ఉరకలేసింది.

"ఆహా ! గట్టనా ? ఏ టి.వి.ల ? ఎన్ని గంటలకు ?" యౌవన ప్రాంగణములో అడుగు పెట్టబోతున్న బాలామణి ఊహాలోకంలో చిరంజీవి చిందులేశాడు.

"నేను గూడా విన్న, మా పక్కింటి టీ.విల ఇయ్యాల రాత్రి తొమ్మిదిన్నరకు ఈ టి.వి.ల వస్తది". టింగురంగా అంటూ టీనేజ్ దాటేస్తున్న జవ్వని ఎదపొదలో మలయమారుతం వీచింది.

"అబ్బో !... అయితే తప్పక జూడాలే!" మురిపాల మూట విప్పేసిందో యువతి.

"ఆ... చిరంజీవి సిన్మాల ఏముంటదీ ? రెండు ముద్దులు, మూడు గుద్దులు, నాలుగు తన్నులు. అదే టైంల జెమినీ టీ.వి.ల వెంకటేష్ సిన్మా వస్తది. గది జూడాలే... నా సామిరంగా... బొంబాట్ గుంటది" లోలోపల గిరికీలు గొడుతున్న తన అభిమాన సినీ హీరోను తలుచుకుంటూ తలూపిందో తరుణి. వేళ్లమధ్య రూపుదిద్దుకుంటున్న బీడి సగంలోనే ఆగిపోయింది. ఆ ఊపుకు జడలోని మల్లెదండ మెడమీంచి దూకి ఛాతిమీదికొచ్చింది.

"అవునవును. హబ్బో... హీరో అంటే వెంకటేషే. గా చిరంజీవి ముసలోడైండు గదా !" ముప్పయైదేళ్ల ముదిత మురిసిపోయింది. హుషారు ఎక్కువై పక్కనున్న పడతి వీపుమీద చరిచి కనుబొమ లెగరేసింది - 'అవును గదా !' అన్నట్టుగా.

ఆడుతూ పాడుతు పనిజేస్తుంటే అలపూ సొలుపేమున్నది అన్నట్టుగా వేళ్లు బీడీలు చుడుతుంటే నోళ్లు మాటలు కురిపిస్తున్నై. కార్ఖానాలో కలహంసల నవ్వుల జల్లులు కురుస్తున్నై.

మాటల పోటీలను, కొమ్మల కోలాహలాన్ని, బీడీల నాణ్యతను ఒళ్లంతా కళ్లు చేసుకుని పరిశీలిస్తున్న మునీమ్ (గుమస్తా)కు చక్కిలిగింత పెట్టినట్టనిపించింది. చిరునవ్వు పెదాలు చిద్విలాసంగా కదిలినై.

"గా సిన్మా హీరోలు మీకేమన్నా బువ్వ వెడ్తుండ్రా? బట్టలు దెస్తుండ్రా ? మనకు రెక్కాడితే డొక్కాడ్తది. బీడీలు జేస్తే బతుకుతం గానీ మాటలతోని కోటలు దుంకుతమా? కానీ... కానీ... కానియ్యండ్రి. బీడీలు జెల్ది జెల్ది జెయ్యండ్రి." ఎప్పట్లాగే హెచ్చరించాడు.

"అన్నా... మునీమన్నా!" తియ్యని పిలుపు మెల్లిగా విన్పించింది. మునీమ్ చూపులు అటువైపు మళ్లినై.

కొత్త యువతి సరికొత్త చూపులతో ముందర ప్రత్యక్షమైంది.... కొచిప్పలోలె కళ్లు, మద్దమందారమోలె ముఖం, ముతక చీరలో దాగలేమంటున్న అందాలు... ముద్దొస్తుంది.

"ఏందీ... ఏంగావాలె !?" సర్దుక్కూచున్న మునీమ్ గొంతులో గాంభీర్యం.

"నేను గూడా బీడీలు జేస్తానన్నా !" సన్నగా వణికిపోతోంది.

మునీమ్ కళ్లు ఆ యువతినాపాద మస్తకం తడిమాయి.

"మీదేవూరు ?"

"నారాయణరావు పేట..."

"అరే... నారాయణరావు పేటా?" అది మా అత్తగారి వూరు, నీ పేరేంది ?"

"సుగుణ..." సుగుణలో ఆశ చిగురించింది.

"బీడీలు ఎప్పుడన్నా చేసినవా ?"

"చేసిన. మా వూర్లె కార్ఖానాల జేసిన. మా ఇంటికాడ రోజా చేసిన, రోజుకు హజార్ బీడీ జేస్తున్నా".

"ఏదీ... నీ ఫారం చూపించు"

"ఫారమా ? అది మా వూర్లెనే ఉంది. ఇంటికాడ గూట్లె వెట్టిన"

"గూట్లె ఉన్నా లాభం లేదు. నోట్లె ఉన్నా లాభం లేదు. ఫారం గక్కడ వెట్టొచ్చి గిక్కడ బీడీలు జేస్తనంటే ఎట్లా ?" గంయ్‌న నవ్వి కుడిచేతి మునివేళ్లతో నెత్తిగొట్టుకున్నాడు.

"జెరంత దయజెయ్యాలన్నా ! బీడీ మంచిగ జేస్త. దారం గట్టిగ జుడ్త. రోజుకు పదిహేను నూర్లు గూడా జేస్తానన్నా. సాయంజెయ్యన్నా !" విశాల నయనాల్లో విషాదరేఖలు కదలాడినై.

"మరీ... ఫారం మీ వూర్లెవెట్టి నువ్విక్కడి కెందుకొచ్చినట్టూ?"

చివుక్కున తలపైకెత్తింది.

"నేనా... నే.. నూ..." ఉదయ కమలం లాగున్న మొహం పగటి కలువలాగైంది.

కత్తిరించిన ఆకులో మెత్తని పొగాకు పొడి మడిచి వేళ్లమీద బీడీలను నాట్యమాడిస్తున్న మహిళా కార్మికులు ఆసక్తిగా చూస్తున్నారు.

"ఈమె పెద్దింటి పిల్లగావచ్చు"

"దీని వెనక ఏదన్నా సస్పెన్స్ కథ ఉండొచ్చు" యువతుల పిసపిసలు, గుసగుసలు.

"ఆహా ! రమ్యకృష్ణోలె వుంది. చిరంజీవసుంటి ఈ వూరి పిల్లగాన్ని పెండ్లి చేసుకుని అత్తగారింటి కొచ్చిందేమో !" బారెడు జడ, మూరెడు కొంగుతో మురిసిపోతున్న చిరంజీవి అభిమాని కళ్లు విచిత్రంగా తిప్పేసింది.

"కాదు కాదు. ఈ మల్లెతీగ సౌందర్యోలె వుందిగదా ! వెంకటేషసుంటి హీరోతో ఈ వూరికొచ్చిందేమో !" పంజాబీ డ్రెస్‌లో పులకిస్తున్న వెంకటేష్ అభిమాని ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వు చిందులేసింది. దారం చుట్టుకుంటున్న బీడీ వేళ్లమధ్య ఆగిపోయింది.

"ఈ పిల్ల మొకం అచ్చం సావిత్రి లెక్క వుంది. చచ్చిపోయిన సావిత్రి మల్లా పుట్టి పెరిగి గిటొచ్చినట్టుంది మునీమన్నా..!" ముప్పయ్యైదేళ్ళ మందస్మిత కొంగు సవరించుకుంది.

ఒంటిమీద గండుచీమలు పాకినట్టుంది సుగుణకు

"ఛి... ఛీ... ! మీదంతా సిన్మాల పిచ్చి. ముప్పయ్యైదేళ్లు దాటిన ప్రౌఢ అందుకుంది". మీరు పిల్లలు, మీకేం తెలుస్తదీ ? ఈ పిల్ల ఊర్లె కార్ఖానా బందై పోయిందేమో ఈ వూరికొచ్చింది. కిళ్లీని దబుక్కున మింగి "ఏం పిల్లా ! జాంపండోలున్నవ్. ఒంటిగ వచ్చినవా లేక ఎంట ఎవలనన్నా వెంటబెట్టుకొచ్చినవా ?" కళ్లు కమ్మగా తిప్పేసింది.

"ఒంటిగ రాలేదక్కా !" గుండెల్లోని గుబులు నుదుట చెమట బిందువై కన్పిస్తుంది.

"... నాగ్గూడా ఆకు, తంబాకు ఇప్పించక్కా నేను గూడా మీతోని బీడీలు జేస్తా. నీకు పుణ్యముంటుదక్కా " చెమట బిందువుల్ని కొసకొంగుతో అద్దుకుంది. మునీమ్ చూపులామె మీదనే నిలిచిన్నై.

వారెవ్వా. . . గీపోరి పుల్లారెడ్డి లడ్డోలుంది. గిసొంటి చుక్క గీ కార్ఖానాల ఒక్కతి గూడా లేదు. దీని మొకం జూస్తెనే లోపలి నుండి హుషారు పుట్టుకొస్తుంది.

దృష్టి కార్మికులవైపు మళ్లింది.

వామ్మో ! అందరూ నన్నే చూస్తున్నరు. గమ్మత్తుకోసం ఇంకేదన్నా అంటే ఈ ఆడమేళం గడ్బడు జేస్తది. వీపు సాపు జేసి సున్నం బెడ్తరు. నా పని నేను జూస్కుంటే మంచిది.

"పుణ్యం, పాపం బీడీల కార్ఖానాలుంటయా ? నేను నౌకరిగాణ్ని. ఆమె వర్కరు. కొత్తోళ్లను ఎవ్వర్నీ తీసుకోవద్దని మా సేటు గట్టిగ జెప్పిండు. ఇక్కడ నీకెవ్వరూ సాయం జెయ్యరు. సప్పుడు జెయ్యక వచ్చిన తొవ్వల పో". ఖచ్చితంగా చెప్పేసి మొహం తప్పుకున్నాడు.

"గీ పల్లెటూర్ల బీడీలెందుకు జేస్తవ్ ? పట్నం బొయ్యి మంచిగ సిన్మాలల్ల నటించు, గిసొంటి మునీములు నీ బొమ్మకాళ్లకు దండాలు వెడ్తరు" గుమ్ముగా అనేసిందో పదమూడేళ్ల బాల.

ముక్కుమీద మూడు గుద్దులు గుద్దినట్టనిపించింది మునీమ్‌కు.

"ఓర్నియవ్వ ! సిన్మాలల్ల యేషం సంపాదించుడంటే బీడీల కార్ఖానల ఫారం సంపాయించినట్టనుకున్నవా ? వేలెడంత లేవు. మూరెడంత మాట్లాడ్తున్నవ్. చెయ్ చెయ్. తంబాకు సరిగ నింపు. దారం గట్టిగ జుట్టు..." మందలించాడు.

ఆ మందలింపు అందరికీ వర్తిస్తుందన్నట్టు మిగతావారిని వరుస బట్టి చూశాడు.

మాటలు మానేసి పనిలో లీనమయారంతా. మిలమిలలాడే సుగుణ కళ్లను నీటిపొరలు కమ్మేసినై. నిరాశగా వెనుదిరిగింది. కాళ్లీడ్చుకుంటూ గుడిదాకా వచ్చేసింది.

మంటపమ్మీద నర్సయ్య కూచున్నాడు. తన కొరకే చూస్తున్నట్టు లేచి ఎదురొచ్చాడు.

"ఏమైంది సుగుణా ? పని దొరకిందా లేక నాలెక్క నువ్వు గూడా వట్టి చేతులతో వచ్చేసినవా ?"

కళ్లు లోతుకుపోయి కాళ్లు పీక్కుపోతున్న సుగుణను నీరసం ఆవహించింది.

"అంటే ... నీక్కూడ పని దొరకలేదా ?" అంటూ అతని ఛాతీ మీద ఒరిగిపోయింది.

సుగుణ భుజాలను ఒడుపుగా అదిమి పట్టి నడిపించుకొచ్చి మంటపమ్మీద కూచోబెట్టాడు. స్తంభానికి వీపు ఆనించి ఒరిగింది సుగుణ.

"మనం తప్పు జేసినమా నర్సయ్యా ?" గుండెలోని సుడిగుండాల్లోంచి తోసుకొచ్చిన బాధనాపుకోలేక అడిగింది.

"తప్పో, ఒప్పో . . . వచ్చేసినం " ఆవేదనను దిగమింగుతూ సుగుణ కపోలాల మీదికి జారిన కన్నీటిని ఆవిడ కొంగుతోనే అద్దాడు.

కరువు కాటకాలకు పుట్టినిల్లైన మెదకు అనబడే మెతుకు జిల్లాలో ఓ పల్లెటూరు. యాభయ్యేళ్ల క్రితం ఊళ్లో తొంభైశాతం అమాయకులుండేవారు. పంచాయతీరాజ్ పుణ్యామాని పంచాయతీలు పెరిగినై. ఇప్పుడు యాభైశాతం మాయల మరాఠీలున్నారు. మాయామర్మాల కామడదూరంలో ఉన్న మంగలి నర్సయ్యకూ, బీడీలు చేస్తూ బీదరికాన్నెదిరిస్తున్న సుగుణకూ రోజూ ఊరి మధ్యనున్న వేణుగోపాల స్వామి ఆలయానికెళ్లే అలవాటుంది.

కట్నంతో అల్లుణ్ని కొనలేని అమ్మానాన్నలతో పాటు ఇద్దరు తమ్ముళ్లున్నారు సుగుణకు.

ఊహ తెలియక ముందే తల్లీదండ్రుల్ని పోగొట్టుకొని మేనమామ ఇంట్లో పెరిగిన నర్సయ్యకు ఇంట్లోనే మేనమరదలు బాలమణి ఉంది. బాలమణి మనసులో ఏముందో గాని ఆవిడ మాత్రం నర్సయ్య గుండెగూటిలో చెల్లెలు స్థానాన్నాక్రమించింది.

కళవిద్యలెన్ని నేర్చిన కులవిద్యల సాటిరాదు అని తెలిసిన మేనమామ ఏడో తరగతి పాసవగానే చదువుల బడి మాన్పించి జీవితమనే బడిలోకి దింపి కులవిద్య నేర్పించాడు. కత్తెర మీసం, గుబురు మీసం, అక్కినేని మీసం ఒకటేమిటి. . . అన్ని రకాల షేవింగ్‌ల్లో చెయ్యి దిరిగింది. క్రాఫింగ్ విద్యలో కళాకారుడన్పించుకున్నాడు. ఎవ్వరికెలా కావాలంటే అలా క్రాఫింగ్ చేసి భేష్ అన్పించుకున్నాడు. కాని. . . అవన్నీ పల్లెటూరు ప్రజలకే పరిమితమైపోయినై.

ఎవరికివారే యమునా తీరే అన్నట్టు చాలారోజుల వరకు సుగుణ నర్సయ్యల మధ్య చూపులే గాని పలుకరింపులు లేవు. కలిసి ప్రదక్షిణాలు చెయ్యడం, ఒకేసారి పక్కపక్కన నుంచుండి తీర్థప్రసాదాలు పుచ్చుకోవడం కాకతాళీయంగా జరిగిపోతుంది.

"రోజూ మీరిద్దరొకేసారి గుడికొస్తారు. మూగదయ్యాల్లా తిరిగి మాటల్లేకుండా వెళ్తారెందుకూ?" తీర్థం బెడుతూ అడిగాడోరోజు పూజారి.

ఒకరినొకరు చూసుకున్నారు. ఎదలోపలి అల్లరి పెదాలను కదిలించింది. పలుకరింపుతో ప్రారంభమైన పరిచయం వారికి తెలీకుండానే మనసులిచ్చి పుచ్చుకునేదాకా వెళ్లింది. మూగ మనసుల్లో ఒకరంటే ఒకరికి ఆరాధన.

"ఒరేయ్ నర్సయ్యా ! వచ్చేనెలల మాంచి మూర్తాలున్నాయని పంతులు జెప్పిండురా, బాసింగాలు గట్టి బాలామణిని నీ చేతుల వెట్టి మీ అమ్మకిచ్చిన మాట నిలవెట్టుకుంటాన్రా" మేనమామ ప్రకటన నర్సయ్య నరాల పొరల్లో ప్రకంపనాలు రేపింది.

చావు కబురు చల్లగా చెప్పినట్టు - అదేరోజు గుడిలో సుగుణ చెవిలో వేశాడు. సుగుణ అంతరాళాల్లో ఆందోళనా తరంగాలెగసి పడినై.

వామ్మో ! నర్సయ్య ఇంకొకల సొంతమైతే భరించగలనా ! మంచి మనసు, చలాకి చూపులు, అమాయకత్వం... నా కోసం ఏదైనా చేస్తాడు. నర్సయ్యను వదులుకోవడమంటే చేతికొచ్చిన వరాల ముల్లెను నూతిల పారేసినట్టే గదా ! మరీ... నర్సయ్యను పెండ్లి జేసుకుంటనంటే అమ్మానాన్న లొప్పుకుంటారా ? ఊహూ ! తోలు వొలిచి తోర్నం గడ్తరు. కానీ... నర్సయ్య నాక్కావాలె, దేవుడా! నువ్వే దిక్కు... దేవునికి మొక్కుకుంది. నర్సయ్యతో మొక్కించింది.

కళ్లల్లో కళ్లు గలిపి చూసుకున్నారు. మనసులు విప్పి మాట్లాడుకున్నారు. తెగింపు వినా మరో మార్గం కనబడలేదు. గుడిలోనే పకడ్బందీ పథకం సిద్ధమైంది.

మంగలి కల్ప నా దగ్గరుంటే మరుభూమిల గూడా మాణిక్యాలు దీస్తాననుకున్నాడు నర్సయ్య. దాన్నే చంకల వేసుకుని చెరిసగం రాత్రి ఊరు బయటికొచ్చేశాడు.

నర్సయ్య పక్కనుంటే నాకం దిగివస్తుంది. అతన్తోనే నా లోకం, రోజుకో వెయ్యి బీడీలు జేసినా మా బట్టపొట్టకు ఢోకాలేదు. దృఢ నిర్ణయం అదేరోజు రాత్రి సుగుణను గడప దాటించి ఊరి బయటకు తీసుకొచ్చింది.

చీకటి వెలుగులో కలుసుకున్నారు. చేతిలో చెయ్యేసి నడిచారు. భయం గుప్పిట్లోంచి పూర్తిగా బయట పడలేదు. ఈ ఊరిలో అడుగు పెట్టగానే ఈ వేంకటేశ్వరాలయం కన్నుల పండువుగా కన్పించింది. ప్రాణాలు లేచొచ్చినై.

పూజారి నారాయణశాస్త్రికి పాదాభివందనం చేసి విషయమంతా విన్నవించుకున్నారు. అతడేమంటాడోనని ప్రాణాలు అరచేతుల్లో కొచ్చినై.

"మేము తప్పు జేసినమా పంతులూ ?" చేతులు జోడించి అడిగాడు నర్సయ్య.

"మాకిప్పుడు తల్లైనా మీరే. తండ్రైనా మీరే. జెరంత దయజెయ్యండ్రి పంతులూ" సుగుణ కనుకొలుకుఉల్లోంచి రాలిన రెండు నీటిబొట్లు శాస్త్రి పాదాల నభిషేకించినై.

సుదీర్ఘ జీవన యానములో కష్టసుఖాల కావడి మోసి తలపండిపోయిన నారాయణశాస్త్రి గుండె కరిగి వాత్సల్యం పొంగింది. గాలికి తలలాడిస్తున్న పూలమొక్కలు, దేవుని పాదాల చెంత పరవశించాలని తహతహలాడుతున్న పూబాలలు ఓ సత్కార్యం చేసి చూపుమని ప్రోత్సాహించినై.

"మీకేం భయం లేదు" అభయహస్తమందించాడు. మీరు చిన్నపిల్లలు కాదుగదా! నచ్చిన వారిని పెళ్లి జేసుకునే స్వేచ్ఛ యువతీ యువకులకుంది. మీరు కాని పని ఏదీ చెయ్యలేదు. ఆ దేవుడు మీకు మేలు జేస్తడు."

"మరి... నేను మంగలిని. సుగుణ పద్మశాలిది. మా పెండ్లికి పెద్దోల్లు ఒప్పుకోరని పారిపొయ్యొచ్చినం."

"దైవసృష్టిలో వర్ణాలేగాని కులాలు లేవు. నర్సయ్యా, మన పూర్వీకులు వృత్తిని బట్టి కులాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ కులాలు వివాహ వ్యవస్థకు అడ్డుగోడలు కావన్నారు. మీలాంటి యువతీ

యువకులు ధైర్యంగా, ధర్మబద్ధంగా ముందుకొస్తే కులాల గోడలు కూలిపోతై" సముదాయించాడు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో పూలదండలు మార్పించాడు. మాంగల్యం తంతునానేనా . . . మంత్రోచ్చారణతో పసుపుకొమ్ము మంగళసూత్రం కట్టించాడు.

నర్సయ్య కళ్లలోని కాంతులు సుగుణ బుగ్గలమీది సిగ్గుల నేరుకుంటుంటే తన కర్తవ్యాన్ని నిర్వహించాడు.

"ఆ ఏడుకొండల శ్రీనివాసునిది గూడా ప్రేమ వివాహమే సుగుణా ! దైవసన్నిధిలో జరిగిన పెళ్లికి దేవతల ఆశీస్సులుంటాయంటారు. ఆ పైవాడి కరుణతో పచ్చగా బతకండి" ఆశీస్సులందించి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

మొదటి రోజు ప్రసాదమే పెళ్లి భోజనమైంది.

రెండో రోజు పూజారి ఇంటి భోజనం పరమాన్నంలాగన్పించింది. దాంతోనే ఆరోజు గడిచింది.

మూడోరోజు ఉదయం నారాయణశాస్త్రి కనబడలేదు. కొత్త పూజారి గర్భగుడిలో పూజ చేస్తున్నాడు. నూతన దంపతుల గుండెల్లో డప్పులు మోగినై.

"ఆ పూజారయ్య లేడా బాబూ!" అడిగాడు నర్సయ్య.

"ఆయనిక్కడ ఒంటిగాడు గదా ! భార్యా పిల్లల్ని చూసొస్తానని వాళ్లూరికెళ్లిండు" కొత్త పూజారి మత్తుగా చూశాడు.

మొహాలు చూసుకుని మంటపమ్మీద కూలబడ్డారు. వాళ్ల మొహాల్లాగానే ఆకాశం వివర్ణమైంది. అంబరవీథిలోంచి చినుకుల ముత్యాలు రాలిపడినై. అలా పావుగంట గడిచింది. వానజల్లు ఆగిపోయింది.

"గిట్లా గీ గుడి మూలమీద ఎన్ని రోజులుంటం ! బయటికి వోదాం. నీ పని నువ్వు జూస్కో. నా పని నేను జూస్కుంట. పని దొరకంగనే ఠికాణా జూసుకుందాం" అంది సుగుణ బలవంతంగా నవ్వుతూ.

"అవును లేకపోతే గుడిలనే సంసారం బెట్టి పిల్లలను కంటమా?" కావాలనే నవ్వాడు నర్సయ్య.

ఫో నర్సయ్యా సహజంగా నవ్వేసిన సుగుణ చెంపలమీద కెంపులు పూచినై. గుడిల నీళ్లున్నై కాబట్టి స్నానం గీనం జేస్తున్నం. పూజారి మంచోడు కాబట్టి ఓ మూల ఉండనిచ్చిండు. ఇంగ మనం బయటకెళ్లి తీరాలె"

ఏనుగులా వెళ్లి . . . పీనుగులా తిరిగొచ్చాడు. పొద్దు నెత్తి మీదికొచ్చింది.

"ఇదిగో ప్రసాదం, నారాయణశాస్త్రి మీకివ్వమని చెప్పిపోయిండు" కొత్త పూజారి చెరో పిడికెడు పులిహోర పెట్టి చేతులు దులుపుకుంటూ వెళ్లిపోయాడు.

ఒక పిడికెడు పులిహోరకు నాలుగు దోసిళ్ల నీళ్లు తోడైనై. ఆత్మారాముని అల్లరి సద్దుమణిగింది.

గుడి బయటికొచ్చి మెట్ల మీద కూచున్నారు దిగులుగా. నీరెండ జోరు ఒంటికి హాయి నిస్తుంది. మెట్ల దగ్గర సయ్యాటలాడుకుంటున్న కుక్కల జంటవైపు మళ్లింది దృష్టి.

మగకుక్క తెల్లగా ఉంది

ఆడకుక్క నల్లగా ఉంది

పొడగాటి నాలుకలు చాచి ఏవో సైగలు చేసుకుంటున్నై.

నల్లకుక్క తెల్లకుక్క చుట్టూ తిరిగింది.

తెల్లకుక్క నల్లకుక్క చుట్టూ ప్రదక్షిణం చేసింది.

ఆ తర్వాత ఎదురెదురుగా నుంచుని మూతులు నాక్కున్నై. నాలుకలు లోపలికి లాక్కుని నవ్వుకున్నై.

మగకుక్క ఆడకుక్కను ఒరుసుకుంటూ వెనకవైపు వెళ్లింది.

ఎక్కడినుండో ఓ చారల కుక్క బాణంలా దూసూకొచ్చింది. అది మగకుక్క. దాని కళ్లలో ఆశారేఖలు అల్లాడుతున్నై. అది నాలుక చాచి ఆడకుక్క మూతి నాకబోయింది. ఆడకుక్క గంయ్‌య్‌మంది. చారల కుక్క బభౌ... బభౌమంటూ రాగాలు దీసింది. ఆడకుక్క చటుక్కున పక్కకు తప్పుకుంది. చారల కుక్క దానిపక్కనే జేరి కుంయ్ కుంయ్‌మంది.

తెల్లకుక్క, నల్లకుక్క మొహాలు చూసుకున్నై. రెండూ ఒకేసారి అరిచినై. చారల కుక్క మీదికెగబడి ఒళ్లంతా గాట్లు పెట్టినై. చారల కుక్క బిక్క మొహమేసుకుని పారిపోయింది.

నల్లకుక్క విజయగర్వంతో తోకాడిస్తూ కళ్లు మిటకరించింది.

వెనకవైపు నుండి ఓ ఎర్రకుక్క వచ్చి చేరింది. చిరునవ్వులనాపుకోలేక పోతున్నట్టు పెదాలను గమ్మత్తుగా కదిలించింది. బాంయ్ బాంయ్ మంటూ మగకుక్క చుట్టూ తిరిగింది. మగకుక్క పక్కకు జరిగింది. ఎర్రకుక్క దాని ముందుకెళ్లి భౌభౌమంది. నకారాత్మకంగా తలాడించింది.

ఎనలేని పౌరుషం ఎదలోంచి పొంగుకొచ్చిందేమో. . . ఎర్రకుక్క కళ్లు విశాలమైనై. మగకుక్కనో క్షణం గుర్కాయించి చూసింది. మగకుక్క కళ్లల్లో ఏముందోగాని ఎర్రకుక్క కళ్లు ఎప్పట్లాగైపోయినై. అది కుంయ్ కుంయ్. . . కుంయ్ కుంయ్ మంటూ స్టైల్‌గా వెనక్కుతిరిగి మగకుక్క మూతికి తోకానించింది.

తెల్ల, నల్ల కుక్కల మొహాలు గంభీరంగా మారినై. కాళ్లను భూమికి అణగదొక్కుతూ కళ్లతో మాట్లాకున్నై. తలలాడించు కున్నై. ఎర్రకుక్క తోకను కుసిక్కున కొరికినై. ఎర్రకుక్క కుతకుత లాడింది. కుయ్యో మొర్రో అంది. ఆ తర్వాత తోక ముడుచుకుని వచ్చిన దారిలో వెళ్లింది.

జంటకుక్కల కళ్లు మిలామిలా మెరిసినై. సుగుణ - నర్సయ్యల కళ్లు ఆశ్చర్యంగా కలెబడినై. అలాగే చూస్తూ కూచున్నారు.

ఇంతకు ముందు శృంగభంగమై పారిపోయిన రెండు కుక్కలు మరో రెండు కుక్కల్ని వెంటబెట్టుకొచ్చినై.

నాలుగు కుక్కలు భౌభౌ... బభౌభౌమంటూ జంటకుక్కల చుట్టూ తిరిగిన్నై. జంటకుక్కలు బెదరలేదు. నాలుకలు లోపలికి తీసుకుని మూతులు బిగించిన్నై.

నాలుగు కుక్కలు జంటకుక్కల కెదురుగా నుంచుండి బబభౌభౌ. . . బబభౌభౌ. . .భౌభౌమని మొరిగిన్నై. సంజాయిషీ అడుగుతున్నట్టు తలాడించిన్నై.

సుగుణ - నర్సయ్య కంటి మెరుపుల్లో రంగులు మారుతున్నె. మనసుల్ని మానవాతీతమైన శక్తి ఏదో ఆవహిస్తూంది.

"చూసినవా నర్సయ్యా ! పాపం ! గా నాల్గు కుక్కలు ఆ కుక్కల జంటను బెదిరిస్తున్నై" నర్సయ్యకు దగ్గరగా జరిగి ముక్కుమీద వేలేసుకుంది సుగుణ.

"ఉండుంటూ ! ఏమైతదో చూద్దాం" సర్కస్ చూస్తున్న చిన్నపిల్లాడై పోయాడు నర్సయ్య.

కలిసివచ్చిన నాలుగు కుక్కల భౌభౌలను, కోపతాపాలను గంయ్ గంయ్‌లతో ఎదుర్కొంటూందా కుక్కల జంట.

నాలుగు కుక్కల గొంతులు తారాస్థాయికి చేరుకున్నై. భౌభౌలు బబేభభౌలు ముదిరిపోయిన్నై.

మేమేమన్నా తక్కువ తిన్నామా అన్నట్లు జంట కుక్కలు మరింత గట్టిగా మొరిగిన్నై. తిట్టుకు జవాబు కొట్టు తరహాలో ఎగబడిన్నై. కాళ్లు నేలకు రాస్తూ సమాధానమిస్తున్నై.

నాలుగైదు నిమిషాల పాటు నాలుగు కుక్కలు మొరిగి మొరిగి నాలుగు కాళ్ల బలం చూపిస్తూ పారిపోయిన్నై.

"ఆహాహా!" సుగుణ సంతోషాన్నాపుకోలేక నర్సయ్య చేతులు పట్టి లాగింది. "చూసినవా నర్సయ్యా ! వాటి ధయిర్యం ఎంత పంజేసిందో !" కళ్లలోకి సూటిగా చూసింది.

కుక్కల జంట గర్వంగా తలూపుతూ గుడి వెనక్కు వెళ్లి పోయింది.

నర్సయ్య వెన్నుపూసలోంచి కొత్తధైర్యం తన్నుకొచ్చింది.

"అరె ! గా కుక్కలకున్న సాహసం మనకు లేదా ?" గబుక్కున సుగుణ భుజాలందుకున్నాడు. సుగుణ సన్నగా నవ్వింది.

"ఎందుకు లేదూ !" ఛాతీ విరిచింది. "మానూరోల్లకు, మనోల్లకు మనమెందుకు భయపడాలె ? మనమేమన్నా కాని పంజేసినమా ? మన రెక్కల కష్టంతోని మనం బతుకుదాం చలో మనూరికి మనం బోదాం పా!..." కళ్లతో తోవ జూపించింది.

ఇద్దరిలో ఆత్మ విశ్వాసం బలపడింది. నరాల్లో కొత్తరక్తం ప్రవహిస్తూంది.

మనసుల్లో మంగళవాద్యాలు మోగిన్నై. కళ్లు మణిదీపాల్లా వెలిగిన్నై. చెంగు చెంగున మెట్లు దిగి చక చకా నడిచారు.

'మూసీ' మాసపత్రిక నవంబర్ - డిసెంబర్, 99